'నామీద మీకుగల నమ్మకంవల్ల కాదా?'

'మీ మీద నాకున్న నమ్మకానికీ, ఆకాశ రామన్న ఉత్తరాలకీ ఏమీ సంబంధం లేదు. ఉండటానికి ఎంతమాత్రం వీల్లేదు. మనద్దరి నమ్మకం వ్యక్తిగతం. మధ్య ఈ ఆకాశరామన్న గాడెవడు!' అని నావైపు కాంతివంతమైన కళ్ళతో చూసింది స్వర్ణ. ఆ చూపును చూసిన ప్రసాద్ స్వర్ణమీద ఆశ అప్పుడే వొదులుకున్నాడు. అతనిలో ఈర్ష్య తాటి ప్రమాణంగా లేచింది.

'ఇదంతా చూస్తే అసలీ ఉత్తరాల్ని సృష్టించింది నువ్వేనట్లే ఉంది.'

ఈ నేరారోపణకి స్వర్ణ, జగన్నాథరావు ప్రసాద్ వైపు వింతగా చూశారు.

'కోపంతో అంటున్నావా?'

'ఆధారం ఉంది. స్వర్ణకి వొచ్చిన ఆకాశ రామన్న ఉత్తరం నన్ను గురించే. నీ ప్రసక్తి అసలు దాంట్లో లేదు. నాకు స్వర్ణని గురించి అలా రాసి, ఆమెనించి నన్ను వేరుచేసి నువ్వామెను వివాహం చేసుకోవాలని వేసిన ఎత్తు.'

ఒక్కక్షణం జగన్నాథరావు ఆలోచించాడు.

'ఉత్తరాలు రాసిందెవరో నాకు తెలిసింది. కాని పేరు చెప్పను. చెప్పటంవల్ల ప్రయోజనం లేదు' జగన్నాథరావిలా అని స్వర్ణవైపూ, ప్రసాద్ వైపూ చూశాడు.

'ఉత్తరాలు ఎవరు వ్రాసినా, వాటినిగురించి చర్చించడం, ఎవరు వ్రాశారో అని ఆరా తియ్యటము పనిదండగా, టైంవేస్టూ. ఇకా దీన్ని ఇంతటితో ఆపేద్దాం' అంది స్వర్ణ.

మర్నాడు పార్కులో కనబడి, 'నువ్వు నన్ను అభినందించాలి' అన్నాడు జగన్నాథరావు ప్రసాద్‌తో. ఆనాటితో ప్రసాద్ స్వర్ణ మీది ఆశ పూర్తిగా వొదులుకున్నాడు. తరవాత జగన్నాథరావుతో అతను ఎప్పటిలా స్నేహంగా మెలుగుతున్నాడు. అతని పెళ్ళికి ఓ పుస్తకం బహూకరించాడు కూడా. దాని మీద ఇలా రాసిఉంది.

'ప్రియమిత్రులు జగన్నాథరావుకీ, స్వర్ణకీ-మీ ఇద్దరికీ పెళ్ళి చేసిన "ఆకాశరామన్న."'

# వెలుగు నీడలు

అవసరాల రామకృష్ణరావు

చలికాలం. చలి గజగజ వణికించేస్తోంది...

అతడు ముసలి ముద్ద... వీధిలో ముష్టికి వెళ్లి తిరిగి యింటికి రాలేక దారిలో కుప్పగా కూలి పోయాడు ... అతణ్ణి ఎవరు యింటికి తీసుకు వెడతారు? ... ప్రక్కనే పూజారి రంగయ్య ఎవరితోనో మాట్లాడు తున్నాడు, "ఏమండోయ్! యీ యేడు అమ్మవారికి గజవాహనం చేయిద్దామనుకుంటున్నాం... ఏదో... తమకు తోచింది" ఆ రెండో మనిషి పదిరూపాయలు కాబోలు యిచ్చాడు.

భక్తుడి కళ్లు తృప్తితో చెమ్మగిల్లేయి!

ముసిలివాడి కళ్లువిచారంతో మూతపడ్డాయి!

* * *

"ఎందుకండీ నా కోసం యివన్నీను?" అన్నాడు నాయకుడు.

"అయ్యో! అదేంమాట, రాకరాక వచ్చారు మా కార్యాలయానికి!" అని పంచరంగుల కేకులు నాయకుని ముందు పెట్టేరు సన్మాన సంఘంవారు.

"ఇవాళ కూడా గంజిలేదా?" అని అడిగేడు సోములు.

"ఎక్కడిదీ? నువ్వు తెస్తేకదా నేకాచేది?" అంది రామి.

"చూస్తూ చూస్తూ ఛావగలం కనకనా? ఆకులు తినమన్నారుగా ఆహారశాఖా మంత్రులు పట్టా నములుదాం!"

నాయకుడు కేకులు కొరుకుతున్నాడు!

రామి ఆకులు కొరుకుతోంది!

* * *

"ఎంతేమిటి కుట్టుకూలి?"

"బాబూ! యీ ఫ్యాషన్ బుష్‌సూటు నే తప్ప ఈ ఊళ్ళో మరొకరు కుట్టలేరు. మొత్తం 16 రూపాయలు కూలి"

వెంకటేశం డబ్బు యిచ్చి వస్తూంటే యీ మాటలు చెవిలో పడ్డాయి:

"అయితే మిగిలిన పదహారూ ఏంచేశావ్?" అంది లచ్చి.

"ఆ ఏం చేశానా, అయిదు రూపాయలు పెట్టి నీకో కోటాచీర కొన్నాను, కుర్రాళ్ల కుంటుందని నాలుగు గజాల సైను కొన్నాను, నేనో పై మీద కండువా కొనుక్కున్నాను. సరిగ్గా సరిపోనేలేదు" అన్నాడు పైడితల్లి.

పొడుగు 'పైడితల్లి' కండువాలో నలిగి పోయాడు!

పొట్టి వెంకటేశం సూటులో మునిగి పోయాడు!

* * *

"ఇదిగో వద్దని చెపుతున్నాను... నిష్కారణంగా దండుగైపోతుంది. నా కడుపు నిండుగా ఉంది. నాకు పూరీ వద్దు"

"అలాకాదు, నాతో వచ్చినప్పుడు తినవలసిందే... ఏయ్ సర్వర్ రెండు పూరీ పట్రా"

స్నేహితుడు పంతంకొద్దీ తెచ్చిన పూరీ ముట్టుకోలేదు!

రామం బిల్లు చెల్లించి హోటల్ మెట్లు దిగుతున్నాడు.

"బాబూ, ధర్మం తమరు తిని పారేసినంత లేదు..." ఒక మామూలు ముష్టిఘటం.

"అడ్డులే... యిప్పుడేం లేదు" రామం స్నేహితుడితో వెళ్లిపోయాడు.

వదిలేసిన పూరీ కాలువ పాలు!

ముష్టిదాని కడుపు ఆకలి పాలు!

* * *

"నువ్వు పుచ్చుకోకపోతే నన్ను చంపుకు తిన్నట్టే" అంది సీత నోటు అందిస్తూ.

"నే పుచ్చుకోను సుమా, నీకసలు ఆ చీర కొనాలనే కొన్నాను. డబ్బిచ్చెయ్యడమేమిటీ? నే ఒప్పుకోను" అంది రాధ.

"బాగుంది. నీకుమాత్రం ఊరికే వస్తోందా ఏమిటి? మేం ఆమాత్రం ఇయ్యలేనివాళ్లం కాదు." "మరందుకే కోపంవస్తుంది, ఓసారి వద్దంటే వినక, నేను నీకాచీర బహుమానంగా యిచ్చే ననుకో"

"ఎలా అయినా సరే... యిదుగో ఇక్కడ నోటు పెట్టేస్తున్నాను నువ్వు తీసుకున్నా సరే, లేకపోయినా సరే" సీత నోటు బల్లమీద పెట్టి వెళ్ళిపోతుంటే ఓ అర్ధనగ్న అయిన బాలెంత రాలు "అమ్మా, బట్టలేక ప్రాణం చచ్చిపోతూంది! ఏదేనా గుడ్డముక్క" అని దీనాతి దీనంగా అడిగింది. సీత విసురుగా వెళ్ళిపోయింది.

కుంపట్లో నోటుపడి భగ్గున మండింది!

బాలింత మనసు సిగ్గుతో మండింది!

* * *

"రెండుశేర్ల బియ్యం, తలంబ్రాలకి ఏం చాలుతాయే? బలేబాగుంది, సరదాగా ఓపావు గంటయినా యిద్దరూ పోసుకోవాలా? ఓ పెద్ద పళ్లెంనిండా కలుపు" అంది కామాక్షమ్మ పెద్ద కూతురుతో.

"ఎలా కొందామన్నా దొరకలేదు తల్లీ... ఎలాగో ఓ అర్ధపావు నూకలు సద్దండమ్మా... లచ్చి మూసిన కన్ను తెరవడంలేదు. దానికి జావ కాసి పోయాలి" అని బ్రతిమాలుకుంది పని మనిషి నూకమ్మ.

"పెళ్ళిలో కూడా యీగొడవేమిటే!" అని విసుక్కుంది కామాక్షమ్మ.

తలంబ్రాలు నేలలో కలిశాయి!

లచ్చిప్రాణం గాలిలో కలిసింది!

